ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 25 జనవరి 2025



సెమిస్టర్ ఫలితాలు విడుదల

గుజరాతీపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలను అంబేద్కర్ వర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్ సమక్షంలో శుక్రవారం విడుదల చేశారు. బీఏలో 97.10 శాతం, బీకాం జనరల్‌లో వంద శాతం, బీకాం ఒకేషనల్‌లో వంద శాతం, బీఎస్సీలో 77.11 శాతం ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి తెలిపారు. మంచి ఫలితాలు వచ్చినందుకు అధ్యాపకులను అభినందించారు.

ఈ ఇసుకలో తిరిగి... ఈ మట్టిలో కలిసి!



మావోయిస్టు నేత చలపతిరావు (ఫైల్)



మృతదేహం వద్ద ప్రజా సంఘాల నాయకులు, కళాకారుల నివాళి

- ఉద్దానంలో ఎర్రసూరీడు.. చలపతిరావు
- ఇటీవల ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులోని ఎన్‌కౌంటర్‌లో మృతి
- అత్తవారి గ్రామం బొడ్డపాడులో అంత్యక్రియలు
- విప్లవకారులు, ప్రజాసంఘాల నాయకుల నివాళి

పలాస/పలాస రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి):

మావోయిస్టు నేత చలపతిరావు.. ఉద్దానం ప్రాంతానికి ఎర్రసూరీడు. పుట్టింది చిత్తూరు జిల్లాలో అయినా.. ఉద్యమాల పురిటిగెడ్డగా పేరొందిన ఉద్దానంతోనే ఆయనకు అనుబంధం ఎక్కువ. ఉద్యోగరీత్యా విజయనగరంలోని సెరీకల్చర్‌లో పని చేస్తూ.. మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడయ్యారు. ఉద్యోగాన్ని వదిలి.. దళంలో చేరారు. సాధారణ కార్యకర్త నుంచి కమాండెంట్ స్థాయికి ఎదిగారు. ఆంధ్రా- ఒడిశాతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో అనేక ఉద్యమాలు చేసి.. పలువురు పోలీసులు, రాజకీయ నాయకులను అంతమొందించడంలో కీలక పాత్ర పోషించారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన్ను మోస్ట్‌వాంటెడ్ జాబితాలో చేర్చించి.. ఆయన్ను పట్టిస్తే రూ.కోటి రివార్డు కూడా ప్రకటించాయి. ఈ క్రమంలో ఈ నెల 21న ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 16 మంది నక్సల్స్ మృతి చెందగా.. అందులో కేంద్ర కమిటీ సభ్యుడైన చలపతిరావు కూడా ప్రాణాలు కోల్పోయారు. అత్తవారి గ్రామమైన పలాస మండలం బొడ్డపాడులో శుక్రవారం ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. విప్లవకారులు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి.. నివాళి అర్పించారు.

కొన్నేళ్ల కిందట భార్య కూడా..

- చలపతిరావు భార్య పోతనపల్లి రుక్మిణి అలియాస్ అరుణ కూడా విప్లవ నాయకురాలే. బొడ్డపాడు గ్రామానికి చెందిన ఆమె 18వ ఏటనే విప్లవ ఉద్యమాలకు ఆకర్షితులై పోరుబాట పట్టింది. చలపతిరావుతో సన్నిహితం ఏర్పడడంతో ఇద్దరూ వివాహం చేసుకున్నారు. ఆమె దళ కమాండర్‌గా విధులు నిర్వహిస్తూ.. కొన్నేళ్ల కిందట మిస్‌ఫైర్ కారణంగా బుల్లెట్ తగిలి మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు కూడా గతంలో బొడ్డపాడులోనే నిర్వహించారు. తాజాగా అల్లుడు చలపతిరావు కూడా మృతి చెందడంతో.. రుక్మిణి తల్లి సాయమ్మ కన్నీటి పర్యంతమైంది. తన కుమార్తె చిత్రపటాన్ని చూసి విలపించింది. **పూర్తి వివరాలు.. 6లో..**



కుమార్తె చిత్రపటాన్ని చూసి ఆవేదన చెందుతున్న అరుణ తల్లి సాయమ్మ



ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిప్రత్యూష, డీపీవో సౌజన్య భారతి, సర్వే అధికారులు

కోర్టు ఆదేశాలతో..

ఉరుకులు.. పరుగులు

- రాజుల చెరువు గట్టు ఆక్రమణలపై కదలిక
- రెవెన్యూ, పంచాయతీ రికార్డుల్లో వేర్వేరుగా వివరాల నమోదు
- సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశం
- చెరువును పరిశీలించిన ఆర్డీవో, డీపీవో, సర్వేశాఖ ఏడీ

నరసన్నపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణ నడిబొడ్డున ఉన్న రాజులు చెరువు గట్టుపై ఆక్రమణలను గుర్తించేందుకు అధికారులు ఉరుకులు.. పరుగులు పెట్టారు. గొట్టిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 219లో 124.42 ఎకరాలు గ్రామకంఠం ఉండగా... అందులో రాజులు చెరువు సుమారు 13.60 ఎకరాలు విస్తీర్ణం మాత్రమే ఉంది. 2002లో ఈ గట్టుపై అక్కడక్కడ మాత్రమే **(మిగతా 6వ పేజీలో..)**

పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ

- అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు
- గత ఐదేళ్లలో సహకార వ్యవస్థ నిర్వీర్యం
- గాడిలో పెడుతున్న కూటమి ప్రభుత్వం



ఇచ్ఛాపురం పీఏసీఎస్ కార్యాలయం

ఇచ్ఛాపురం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల్లో(పీఏసీఎస్) అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కంప్యూటరీకరణ లేకపోవడంతో గతంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని గుర్తించింది. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమిస్తూ.. కాగితరహిత పాలనకు సన్నాహాలు చేస్తోంది. డిజిటలైజేషన్ పూర్తిచేసి సభ్యులందరితో పొదుపు ఖాతాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ప్రతి రైతుకు ఈకేవైసీ చేసి వివరాలను పూర్తిస్థాయిలో కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ సచివాలయాలకు ఆయా సొసైటీల వివరాలు, లావాదేవీలకు సంబంధించి దస్త్రాలు వెళ్లాయి. సహకార సంస్థ, గ్రామ సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఈకేవైసీ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలో 37 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 1,01,671 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటికే 85 వేల మంది రైతుల ఈకేవైసీ పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

● గతంలో మెరుగైన సేవలు..

గతంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతు సేవలో తరించేవి. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పీఏసీఎస్‌లు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. పీఏసీఎస్‌ల్లో 50 శాతం వాటాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ జగన్ సర్కారు నిర్ణయం తీసుకుంది. అప్పటికే రైతుభరోసా కేంద్రాలకు అధికారాలు కట్టబెట్టడంతో పీఏసీఎస్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి. అందుకే అందులో పనిచేసే ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలుత ఎటువంటి రుసుం చెల్లించకుండానే.. రైతులు ఈ సంఘాల ద్వారా పంట రుణాలు, ఎరువులు పొందేవారు. పంట ఉత్పత్తులు విక్రయించిన తరువాత చెల్లించేవారు. అక్కడకు కొద్దిరోజుల తరువాత సభ్యత్వ రుసుం కింద రూ.10 వసూలు చేసేవారు. సంఘ సభ్యులుగా చేర్చుకునేవారు. ప్రాంతీయ వ్యవసాయ కో-ఆపరేటివ్ బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందేవారు. ప్రస్తుతం పీఏసీఎస్‌ల్లో రైతుల సభ్యత్వం తగ్గిపోయింది. సభ్యత్వ రుసుం ఏకంగా రూ.300కు పెరిగింది. పీఏసీఎస్ కార్యవర్గాల ఎన్నికలు పంచాయతీ ఎన్నికలకు మించిన ఖర్చుగా మారాయి. దీంతో పీఏసీఎస్‌ల్లో అవినీతి కూడా పెరిగిపోయింది. అలాగే గతంలో నాబార్డు రాష్ట్ర సహకార బ్యాంకులకు రుణాలు ఇస్తే.. అక్కడ నుంచి జిల్లా సహకార బ్యాంకులకు, ఆపై ప్రాంతీయ కో-ఆపరేటివ్ బ్యాంకులకు రుణాలు సర్దుబాటు చేసేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సహకార వ్యవస్థకు నిధుల సర్దుబాటు నిలిచిపోయింది. దీంతో జిల్లాలో సహకార బ్యాంకుగా ఉన్న డీసీసీబీ వైసీపీ హయాంలో రైతు సేవలకు దూరమైంది. సాధారణ వాణిజ్య బ్యాంకులా మారిపోయింది. కంప్యూటరీకరణను సైతం అటకెక్కించారు. వీటన్నింటి గాడిలో పెట్టేందుకు, అవినీతి అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

వివరాలు సేకరిస్తున్నాం

జిల్లావ్యాప్తంగా ఉన్న 37 పీఏసీఎస్‌ల పరిధిలో కంప్యూటరీకరణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం రైతుల వివరాల సేకరణ తుది దశకు చేరుకుంది. సహకార శాఖతో పాటు సచివాలయ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. పూర్తికాగానే కంప్యూటరీకరణ చేపడతాం.

-నగేష్, జిల్లా సహకార శాఖ అధికారి, శ్రీకాకుళం



7లో

ఆదిత్యుని హుండీల ఆదాయం రూ.66.89లక్షలు


హుండిలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- 9 తులాల బంగారం, 9.8 కేజీల వెండి చోరీ

నాలుగు రోజులుగా నీరు కలుషితం

- మెళియాపుట్టిలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఇబ్బందులు

8లో



సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దులో అటవీ ప్రాంతం

వన్యప్రాణుల వేట



మైదాన ప్రాంతంలో సంచరిస్తున్న జింక



మాంసం విక్రయాలు (ఫైల్)

- అంతరించిపోతున్న అటవీ సంపద
- యథేచ్ఛగా మాంసం విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

సరుబుజ్జిలి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. వన్యప్రాణులను రక్షించాల్సిన అటవీశాఖ సిబ్బంది జాడ కనిపించడం లేదు. దీంతో అటవీ ప్రాంతంలో కలపతో పాటు అడవి పందులు, జింకలు తదితర వన్యప్రాణులు రోజురోజుకు అంతరించిపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సరుబుజ్జిలి, బూర్జ, ఎల్.ఎన్.పేట, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, మందస, సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో అటవీ ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉన్నది. ఈ అడవుల్లో వివిధ జాతులకు చెందిన వన్య ప్రాణులు జీవిస్తున్నాయి. ఆహారం, తాగునీటి కోసం మైదాన ప్రాంతాలకు వచ్చి వెళ్తుంటాయి. అటువంటి సమయంలో వేటగాళ్ల ఉచ్చుకి బలవుతున్నాయి. ఎటువంటి అనుమతి లేని తుపాకులు, వలలు, నాటుబాంబులతో కొంతమంది వ్యక్తులు వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని విక్రయించడం వ్యాపారంగా మార్చుకున్నారు. అంతర్రాష్ట్ర వేటగాళ్లు ఒకప్పుడు జిల్లాలోని గిరిజన, మైదాన ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులతో కలిసి రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా అడవి పందులు, జింకలు, కనుజులు తదితర జంతువులను వేటాడేవారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న కొంతమందికి వాటి మాంసాన్ని సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఈ ప్రాంత ప్రజలు అటవీ జంతువులను వేటాడేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఒడిశా పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన కొంతమంది వేటగాళ్లు ముఠాగా ఏర్పడ్డారు. వన్య ప్రాణుల వేట మాంసం వ్యాపారాన్ని లాభసాటిగా మార్చుకున్నారు. వన్య ప్రాణులను తుపాకులతో వేటాడి నేరుగా వాహనాల్లో పలాస, టెక్కలి, నరసన్నపేట, హిరమండలం, సరుబుజ్జిలి పాలకొండ ప్రాంతాల్లో **(మిగతా 6వ పేజీలో..)**


ఒక్క క్లిక్‌తో సమాచారం

- జిల్లా పోలీసు నూతన వెబ్‌సైట్ ఆవిష్కరణ



పోలీసు వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు నూతన వెబ్‌సైట్‌ను శుక్రవారం పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. ఒక్క క్లిక్‌తో జిల్లా పోలీసు శాఖ మొత్తం సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీని సహాయంతో జిల్లాలో ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువవుతాయన్నారు. ఈ వెబ్‌సైట్‌లో పోలీసు అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లు, అత్యవసర సమయంలో ఉపయోగపడే నెంబర్లు, ఇతర పోలీసు సేవలు, అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. కంచిలి మండలం కేసరపడకు చెందిన బీటెక్ విద్యార్థి కొరికాన నవీన్ ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారని తెలిపారు. నవీన్‌తోపాటు వెబ్‌సైట్ రూపకల్పనకు సహకరించిన శ్రీకాకుళం ఎన్ఐసీ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్, పోలీసు ఐటీకోర్ సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.వి.రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



శుక్రవారం ఉదయం 8గంటలకు.. శ్రీకాకుళంలో కురుస్తున్న మంచు

మంచు కురిసే వేళ..

శ్రీకాకుళం అర్బన్/అరసవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సిక్కోలు నగరాన్ని పొగమంచు కమ్మేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 9 గంటల వరకూ దట్టంగా మంచు కురిసింది. మంచు ప్రభావంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం వేళ కూడా లైట్లు వేసుకునే వాహనాలతో ప్రయాణాన్ని సాగించారు.



గురువారం అర్ధరాత్రి 12 గంటలకు..

ఈ ఇసుకలో తిరిగి.. ఈ మట్టిలో కలిసి!





చలపతిరావు సంస్మరణ సభలో పాల్గొన్న ఉద్దానం ప్రజలు

- ఉద్దానంలో ఎర్రసూరీడు..చలపతిరావు
- ఇటీవల ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో ఎన్‌కౌంటర్‌లో మృతి
- అత్తవారి గ్రామం బొడ్డపాడులో అంత్యక్రియలు
- 1998 సంవత్సరం వరకూ ఈ ప్రాంతంలోనే...
- అంతిమ సంస్కారాలకు భారీగా తరలివచ్చిన జనం

పలాస/పలాస రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ఎర్రసూరీడుగా పేరొందిన మావోయిస్టు నేత రామచంద్రారెడ్డి ప్రతాపరెడ్డి (చలపతిరావు, సుధాకర్) అంత్యక్రియలు ఆయన అత్తవారి గ్రామమైన పలాస మండలం బొడ్డపాడులో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించారు. సుధాకర్‌గా ఈ ప్రాంతంలో పరిచితుడైన చలపతిరావు... పోతనపల్లి రుక్మిణిని వివాహం చేసుకున్నారు. ఇద్దరూ ఈ ప్రాంతంలో విప్లవోద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఎన్నో క్లిష్టమైన సమస్యలు పరిష్కరించడంతో పాటు ఉద్దానంలో అనేక మందిని మావోయిస్టు పార్టీ వైపు తీసుకువెళ్లారు. ఆయన భార్య దళ కమాండర్‌గా విధులు నిర్వహిస్తునే పొరపాటున తూటా తగిలి మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు కూడా బొడ్డపాడులోనే గతంలో నిర్వహించారు. ఒడిశా-ఛత్తీస్‌గఢ్ అడవుల్లో నాలుగు రోజుల క్రితం పోలీసు బలగాల కాల్పుల్లో ఆయనతో పాటు మొత్తం 24 మంది మావోయిస్టులు మృతి చెందారు. అందులో అగ్రనాయకుడిగా చలపతిరావు ఉన్నారు. ఆయన స్వగ్రామం చిత్తూరు జిల్లా ముత్యంపైపల్లి. ఉద్యోగా రీత్యా ఆయన విజయనగరంలో పని చేస్తూ మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడయ్యారు. ఉద్యోగాన్ని విడిచిపెట్టి దళంలో చేరారు. సాధారణ కార్యకర్తగా జీవితం ప్రారంభించి కమాండెంట్‌గా ఎదిగారు. ఆంధ్రా-ఒడిశా బోర్డర్(ఏఓబీ)లో కార్యదర్శిగా వ్యవహరిస్తూ ఉత్తరాంధ్ర జిల్లాలను మావోయిస్టు పార్టీకి కంచుకోటగా నిలిపారు. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో అనేక ఉద్యమాలు చేసి.. ఎంతో మంది పోలీసు, రాజకీయ నాయకులను అంతమొందించడంలో కీలక పాత్ర పోషించారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనను మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చాయి. ఆయనను పట్టిస్తే రూ.కోటి రివార్డు కూడా ప్రకటించిన విషయం విదితమే. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అలిపిరి దాడి ఘటనలో చలపతిరావు ఏ-1గా ఉన్నారు. అరకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ల హత్య కేసుల్లోనూ ఆయనది ప్రధాన పాత్రగా పోలీసుల అభియోగం. దంతేవాడ, అబూజ్‌మడ్ దట్టమైన అటవీ ప్రాంతంలో సంచరించే చలపతిరావుకు కట్టుదిట్టమైన మావోయిస్టు బందోబస్తు కూడా ఉండేది. వృద్ధాప్యం కారణంగా ఆయన రెండు మోకాళ్లు అరిగిపోవడంతో కర్రల సాయంతో ఎక్కువగా అడవుల్లో తిరుగుతుంటారని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు దళాన్నంతా అంతమొందించారు. ఆ క్రమంలో చలపతిరావు కూడా మృత్యువాత పడ్డారు. మొదట బొడ్డపాడుకు చెందిన రుక్మిణి (అరుణ)ని వివాహం చేసుకున్నారు. ఆమె మరణించడంతో మరో మావోయిస్టు అరుణను పెళ్లి చేసుకున్నారు.

ఉద్దానంతో అనుబంధం..

ఉద్దానం అంటేనే ఉద్యమాలకు పురిటిగడ్డ. చలపతిరావు విజయనగరంలో సెరీకల్చర్ విభాగంలో పనిచేస్తూ అక్కడ ఉద్యోగాన్ని విడిచిపెట్టి దళంలో చేరారు. పీపుల్స్‌వార్ దళంలో పని చేస్తూ ఉద్దానం ప్రాంతంలో ఉద్యమాలు నడిపారు. పగలు పాఠాలు చెప్పడం... రాత్రి వేళల్లో ఉద్యమ బాటలోకి ప్రజలు ఆకర్షితులయ్యేలా చేశారు. చలపతిరావు ఈ ప్రాంతంలో ఎంతోమందికి ఇష్టమైన వ్యక్తి. ఆయన మృతదేహం ఇక్కడకు వస్తుందని తెలియగానే గురువారం రాత్రి నుంచి ఆయనతో సన్నిహితంగా ఉన్నవారు వేచి చూశారు. ఓ వ్యక్తి ఛత్తీస్‌గఢ్ వెళ్లి... చలపతిరావు మృతదేహాన్ని అతికష్టం మీద శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బొడ్డపాడుకు తీసుకొచ్చారు.

అమరవీరుల స్మారక మందిరం వద్ద మృతదేహం..

బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద చలపతిరావు అలియాస్ సుధాకర్ మృతదేహాన్ని విప్లవాభిమానుల సందర్శన కోసం ఉంచారు. పూల దండలు వేసి ఆయనకు అనేక మంది నివాళులు అర్పించారు. అరుణోదయ కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. చలపతిరావు అత్త పోతనపల్లి సాయమ్మ కన్నీటి నివాళులర్పించగా... మాజీ మావోయిస్టుల కుటుంబీకులు వచ్చి తుది వీడ్కోలు పలికారు. మృతదేహాన్ని భారీ ర్యాలీతో ఊరేగించి.. స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. దారి పొడవునా విప్లవ గీతాలు ఆలపిస్తూ ఆయనకు జోహార్లు అర్పించారు. అనంతరం అమరుల బంధు మిత్రుల కమిటీ, పౌరహక్కుల సంఘం, వివిధ ప్రజాసంఘాల నాయకుల జోహార్ల మధ్య అంతక్రియలు నిర్వహించారు. దారి పొడవునా చలపతిరావు చిత్రపటాలను, బ్యానర్లను ఏర్పాటు చేశారు.

ఇక్కడే ఎందుకంటే...

రామచంద్రారెడ్డి ప్రతాపరెడ్డి అలియాస్ చలపతిరావు అంత్యక్రియలు వాస్తవానికి చిత్తూరు జిల్లా ముత్యంపైపల్లి గ్రామంలో నిర్వహించాల్సి ఉంది. ఆయన స్వగ్రామం అదే. ఛత్తీస్‌గఢ్ నుంచి చిత్తూరు జిల్లాకు తరలించడం కష్టంగా మారడంతో ఆయన అత్తవారి గ్రామమైన బొడ్డపాడులో నిర్వహించడానికి అమరుల బంధుమిత్రుల కమిటీ నిర్ణయించింది. బొడ్డపాడు, ఉద్దానంతో చలపతిరావుకు ఎక్కువ అనుబంధం ఉండడం, పైగా అత్తవారి గ్రామం కావడంతో మరో మార్గం లేక అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. దీంతో పాటుగా తాను విప్లవోద్యమంలో మరణిస్తే విప్లవాల పురిటిగెడ్డ బొడ్డపాడులో తన అంత్యక్రియాలు చేసేలా చూడాలని చలపతిరావు అనుచరులకు చెప్పేవారట. ఆయన కోరిక ఈ విధంగా తీరిందని అభిమానులు, విప్లవ నాయకులు చెబుతున్నారు.

18వ ఏటనే విప్లవ బాట పట్టిన రుక్మిణి..

పలాస, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రామచంద్రారెడ్డి ప్రతాపరెడ్డి (చలపతిరావు /సుధాకర్) భార్య పోతనపల్లి రుక్మిణి అలియాస్ అరుణ తన 18వ ఏటనే బొడ్డపాడు గ్రామం నుంచి పోరుబాట పట్టింది. ఈ ప్రాంతంలో అజ్ఞాతంలో తిరుగుతున్న చలపతిరావుతో పరిచయం ఏర్పడి.. 25వ ఏట వివాహం చేసుకున్నారు. వీరికి పిల్లలు లేరు. తుపాకి చేతపట్టి అనేక ప్రాంతాల్లో విముక్తి కోసం పోరాడిన చరిత్ర రుక్మిణికి ఉంది. ఆమె తల్లి పోతనపల్లి సాయమ్మ ప్రస్తుతం వృద్ధాప్యంతో తమ్ముళ్ల ఇంటి వద్ద ఉంటోంది. ఆమెకు అరుణ ఒక్కరే కుమార్తె. చిన్నతనంలోనే దళంలోకి వెళ్లిపోయిందని... మరణించిన తరువాత చూశానని ఆమె తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఫొటోను చూపి స్తూ కన్నీటి పర్యంతమైంది. అల్లుడు చలపతిరావు కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలుసుకొని భోరున విలపించింది. చలపతిరావు మృతదేహాన్ని కడసారి చూస్తూ నివాళులర్పించింది.



దళంలో ఉన్నప్పుడు రుక్మిణి (ఫైల్)

ఏడాదిలో 300 మందిని చంపేశారు



బీజేపీ ప్రభుత్వ హయాంలో ఒక్క ఏడాది కాలంలో 300 మంది మావోయిస్టులను నిర్బంధించి హత్య చేశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యే. చలపతిరావు వంటి వారు కనీసం కదలలేని స్థితిలో ఉన్నా.. పోలీసు బలగాలు కనికరించలేదు. కిరాతకంగా హత్య చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారు. 2026 నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించడం తప్పు. ఇది ప్రజల్లోకి ఎప్పుడో వెళ్లిపోయింది. ఇది ఆరంభమే. అంతం లేదనే విషయం గుర్తించాలి.

-అంజమ్మ, అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు

తలకు వెల కట్టడం బ్రిటీషు వాడి విధానం



నాడు స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు ప్రభుత్వం మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు తలకు రూ.10వేలు వెలకట్టింది. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల కోసం పోరాడి అమరుడైన చలపతిరావు తలకు రూ.కోటి వెలకట్టింది. ఇది ప్రజా ప్రభుత్వమా? బ్రిటీషు ప్రభుత్వమా? ప్రజలే గుర్తించాలి.

-చిలకా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పౌర హక్కుల సంఘం

ఈ ప్రాంతంతో ఎంతో అనుబంధం..



ఉద్దానం ప్రాంతంతో చలపతిరావుకు ఎంతో అనుబంధం ఉంది. 15 సంవత్సరాల పాటు ఈ ప్రాంతంలో ప్రతి మైదాన, గిరిజన గ్రామాన్ని తిరిగి.. ఇక్కడి పరిస్థితులను ఆకళింపు చేసుకున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన మరణించడం విప్లవోద్యమానికి తీరని లోటు.

-దాసరి శ్రీరాములు, బొడ్డపాడు

నిజమైన నివాళి అదే..



ఎంతో మంది మావోయిస్టులను తీర్చిదిద్దిన చలపతిరావు ధన్యజీవి. ఉద్యమాలు తీవ్రంగా ఉన్న రోజుల్లో ఆయన ఈ ప్రాంతంలో తిరుగుతూ... ప్రజలను జాగృతం చేశారు. జీడిపిక్కలకు గిట్టుబాటు ధర నుంచి మెండు అటవీ భూముల కోసం పోరాటం వరకు ఆయన పాత్ర ఉంది. ఆయన ఆశయాలు కొనసాగించడమే నిజమైన నివాళి.

-తామాడ త్రిలోచనరావు, మాజీ సర్పంచ్

వన్యప్రాణుల వేట

(ఐదో పేజీ తరువాయి)

ముందుగా ఏర్పాటు చేసుకున్న వ్యక్తుల ద్వారా కేజీల చొప్పున మాంసాన్ని విక్రయిస్తున్నారు. అడవి పంది మాంసం కేజీ రూ.300, జింక రూ.800, కుందేళ్లు రూ.500, కణుజులు రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. అటవీ జంతువులు కావడం.. తక్కువ ధరకు మాంసం లభిస్తుండడంతో కొంతమంది వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

జాడలేని అటవీ సిబ్బంది...

జిల్లాలో అంతరించిపోతున్న అటవీ ప్రాంతాన్ని కాపాడాల్సిన సంబంధిత శాఖాధికారులు జాడ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సరుబుజ్జిలి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతమంతా పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనమై ఉంది. దీనితో రెండు జిల్లాల అటవీశాఖ అధికారులు ఆయా ప్రాంతాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఎటువంటి అక్రమాలు చోటుచేసుకున్నా పట్టించుకోవడం లేదు. కలప, వన్య ప్రాణుల వేట, క్వారీల తవ్వకం కొంతమంది అటవీ శాఖాధికారులు కనుసన్నల్లోనే జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

తుపాకులపై నిఘా ఎక్కడ...

వన్యప్రాణులను అంతమొందించే తుపాకులపై జిల్లా పోలీస్ నిఘా కొరవడింది. రాత్రివేళల్లో జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బంది గస్తీ కాస్తున్నారు. అయినా వేటగాళ్లు తుపాకులతో వాహనాలపై వెళ్తున్నప్పుడు పోలీసుల తనిఖీల్లో బయటపడకపోవడం గమనార్హం. అలాగే వన్యప్రాణుల వేట కోసం వచ్చే. ఇతర రాష్ట్రాల వ్యక్తులు దొంగతనాలకు కూడా పాల్పడుతున్నారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారులు, పోలీసులు స్పందించి వన్యప్రాణుల రక్షించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కఠిన చర్యలు..

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులను వేటాడుతున్న వ్యక్తులపై నిఘా పెట్టి కఠినచర్యలు తీసుకుంటాం. ఆయా గ్రామాల్లో కొన్ని వన్యప్రాణులు, అటవీ సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

-ఎం.నిహారిక, అటవీరేంజ్ అధికారిణి

సేవా గుణం అవసరం

- గణపతి సచ్చిదానంద స్వామి

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని గణపతి సచ్చిదానంద స్వామి హితవు పలికారు. నగరంలోని దత్తనాథ క్షేత్రంలో రెండో రోజైన శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్య అవసరమన్నారు. తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాల్సిన ఆవశ్యకతను, బాధ్యతలను నేటి యువతకు తెలియజెప్పాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ సంస్థ ద్వారా గ్రామాల అభివృద్ధి, వృద్ధులను ఆదుకోవడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణను కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఈ క్షేత్రంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు. అనంతరం హనుమ, నాగేంద్ర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఆయన వెంట విజయానంద తీర్థ ఉన్నారు. శ్రీవారి సంగీత కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు దుంపల ఈశ్వరరావు ఆధ్వర్యంలో 500 మందితో సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. రఘుపాత్రుని శ్రీకాంత్ ఆధ్వర్యంలో నృత్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గవర విజయరాజు, పన్నాల రామకృష్ణ, బాలాజీ, సురంగి మోహనరావు, ఎస్.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



హనుమాన్ పూజలో పాల్గొన్న స్వామి సచ్చిదానంద



ఇదే రాజులచెరువు గట్టు

కోర్టు ఆదేశాలతో ఉరుకులు.. పరుగులు

(ఐదో పేజీ తరువాయి)

నిర్మాణాలు ఉండేవి. కొత్తబస్టాండ్ వైపు, కాలేజీ రోడ్డులో గేట్ వరకు దుకాణాలు ఉండేవి. అప్పట్లో ఈ చెరువు.. రెవెన్యూ రికార్డులో లేదనే విషయం బయటకు పొక్కింది. దీంతో చాలామంది చెరువు గట్టును ఆక్రమించేశారు. ఈ చెరువు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడం.. గ్రామకంఠంగా ఉండటంతో గతంలో ఈ గట్టుపై పేదలకు ఇళ్ల నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లు ఇబ్బడిముబ్బడిగా మంజూరు చేశారు. అలాగే పలు ప్రభుత్వ భవనాలు కూడా నిర్మించారు. మొత్తంగా సుమారు 395 నిర్మాణాలు చేపట్టారు. కొంతమంది ఏడాది ఒకసారి పంచాయతీకి పన్ను చెల్లిస్తూ.. ఆక్రమణలను పదిలం చేసుకున్నారు.

- ఈ చెరువు పరిరక్షణకు గరీబ్ గైడ్ అనే స్వచ్ఛంధ సంస్థ సభ్యులు 2023 ఆగస్టులో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో ఆక్రమణలపై పలుమార్లు ఎన్‌జీటీ విచారణ చేపట్టగా.. అధికారులు రికార్డులు సమర్పించారు. అయినప్పటికీ మరింత సమగ్ర విచారణ చేపట్టి ఈనెల 31న నివేదిక ఇవ్వాలని గరీబ్ గైడ్ స్వచ్ఛంధ సంస్థకు, అధికారులకు ఇటీవల ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 16న గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సమగ్ర నివేదికను ఎన్జీటీకు సమర్పించారు. కోర్టు ఆదేశాల మేరకు అధికారులు కూడా ఉరుకులు.. పరుగులు తీశారు. శుక్రవారం శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, జిల్లా పంచాయతీ అధికారి సౌజన్యభారతి, సర్వేశాఖ ఏడీ ఆర్.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో చెరువు గట్టుపై నిర్మాణాలను పరిశీలించారు. రాజులు చెరువు రెవెన్యూ రికార్డులో లేదని, గ్రామకంఠం పేరుతో ఉందని రెవెన్యూ అధికారులు గుర్తించారు. తదితర వివరాలను ఆర్డీవోకు నివేదించారు. కాగా ఈ చెరువు గట్టుపై నిర్మాణాలకు పంచాయతీ అధికారులు పన్ను వసూళ్లు చేశారు. కొన్ని భవనాల నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు అనుమతులిచ్చా రని ఉన్నతాధికారులకు స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు తెలిపారు. దీంతో ఈ వ్యవహారంపై ఎన్జీటీకి ఎలా నివేదిక ఇవ్వాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. చెరువు లేదని ఇస్తే.. క్షేత్రస్థాయిలో చెరువు ఉండటంతోపాటు చెరువు అభివృద్ధికి గతంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చెరువు ఉందని నివేదిక ఇస్తే ఏమవుతుందోనన్న అనే మీమాంసలో ఉన్నారు. ఈ చెరువు వ్యవహారంపై జిల్లా కేంద్రంలో రెవెన్యూ, పంచాయతీ, సర్వేశాఖ అధికారులు సంయుక్తంగా నివేదిక సిద్ధం చేస్తున్నారు.

మార్షల్ ఆర్ట్సులో శిక్షణతో మేలు

గుజరాతీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు మార్షల్ ఆర్ట్సుపై అవగాహన పెంచుకొని...ప్రత్యేక శిక్షణ పొందాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ర్యాలీగా వెళ్లి... సూర్య మహల్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. స్త్రీ, సంక్షేమ శాఖాధికారిణి శాంతిశ్రీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి కేవీ రమణ, దిశ ఏఎస్ఐ రేణుక పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

అదృశ్యం కేసుల్లో పురోగతి సాధించండి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పరిష్కారం కాని అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి... పురోగతి సాధించాలని జిల్లా పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో వివిధ కేసులపై ఎస్పీ సమీక్షించారు. అదృశ్యం కేసుల్లో తప్పిపోయిన వారిని గుర్తించేందుకు అన్ని విధాలా దర్యాప్తు చేపట్టాలన్నారు. బాలికలు, మహిళల మిస్సింగ్ కేసులపై మరింత దృష్టి సారించాలని ఆదేశించారు. మహిళలపై దాడులకు సంబంధించిన కేసుల్లో 60 రోజుల్లో చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సముద్రతీరంలో డ్రోన్ సర్వే

సోంపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో హోప్ ఐలండ్‌లను సంరక్షించే చర్యల్లో భాగంగా శుక్రవారం సాగర తీరంలో డ్రోన్ సర్వే నిర్వహించారు. మెరైన్ సీఐ డీవీజే రమేష్ ఆధ్వర్యంలో ఎర్రముక్కాం, మందస మండలం భేతాళపురం, చిన్నలక్ష్మీపురం పరిసర ప్రాంతాల్లో డ్రోన్లతో సర్వే నిర్వహించి.. రాళ్లను గుర్తించినట్టు తెలిపారు. ఈ సర్వేలో ఎస్ఐలు శ్రీనివాస్, శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

సముద్ర తీరంలో సర్వే చేస్తున్న మెరైన్ సిబ్బంది





ఎన్నికల చిహ్నం ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

ఆకట్టుకునేలా..

సోంపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పట్టణలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఓటుహక్కుపై విద్యార్థులు అవగాహన కల్పించారు. ఓటర్ల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిహ్నం ఆకారంలో విద్యార్థులు కూర్చొని ఆకట్టుకున్నారు.

ఆదిత్యుని హుండీల ఆదాయం రూ.66.89 లక్షలు

అరసవల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హుండీల లెక్కింపు శుక్రవారం ఆలయ అనివెట్టి మండపంలో జరిగింది. 65 రోజులకు గాను రూ.66,89,389 ఆదాయం లభించింది. ఇందులో నోట్ల రూపేణా రూ.63,88,254, చిల్లర ద్వారా రూ.3,01,135 సమకూరాయి. ఉదయం 9.00 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వై.భద్రాజీ, పాతపట్నం ఈవో వాసుదేవరావు, ఆమదాలవలస ఈవో టి.రవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీహరి సేవాసమితి, సత్యసాయి సేవాసమితి, శ్రీవారి సేవా సమితి ప్రతినిధులు పాల్గొని లెక్కింపు చేపట్టారు. ఇందులో బంగారం 58 గ్రాములు, వెండి 2.137 కిలోలు, యూఎస్ డాలర్స్-56, నేపాల్-20, దిర్హామ్స్-10, ఇంగ్లాండ్ పౌండ్స్-5, యువాన్-10, శ్రీలంక-2 వచ్చాయి. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సీనియర్ అసిస్టెంట్లు ఎ.శ్రీనివాస్, ఎ.శోభనాద్రాచార్యులు, జూనియర్ అసిస్టెంట్లు కేవీ రమణమూర్తి, ఎం.కావ్యశ్రీ, ఏపీజీవీబీ సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం



బడ్జెట్ ఆమోదం

ఇచ్ఛాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీకి ఆదాయం పెంచేలా బడ్జెట్‌లో మార్పులు చేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి, కౌన్సిలర్ జగన్ కోరారు. చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.14,17,47,462 కాగా, 2025-26 సంవత్సరానికి సంబంధించిన అంచనాల బడ్జెట్ రూ.1869,71,462గా చూపించారు. స్వల్ప చేర్పులు మార్పులతో బడ్జెట్‌ను కౌన్సిలర్లు ఆమోదించారు.

ఆదాయ మార్గాలు పెంపొందించుకోవాలి

ఆమదాలవలస, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మహిళా సమాఖ్యల ద్వారా అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని వెలుగు డీపీఎం మోహనరావు సూచించారు. ఆమదాలవలస మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య కమిటీ సభ్యులకు రెండు రోజులపాటు అందించే శిక్షణ శుక్రవారం ఆయన ప్రారంభించారు. మండల సమాఖ్య ఈసీ మెంబర్లు, ఏపీఎం జి.నారాయణరావు, ఎల్‌సీ నాగరాజు, సీసీలు, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, అధ్యక్షులు ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలు రేణుక, కోశాధికారి సూర్యకుమారి, కార్యదర్శి రోజా తదితరులు పాల్గొన్నారు.

9న బాడీ బిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 9న రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే గొండు శంకర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఇందులో గెలుపొందిన వారికి రూ.1,25,000 నగదు బహుమతి ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు ఇప్పిలి తిరుమలరావు, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు దూరంగా ఉండండి

కవిటి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాల వలలో చిక్కుకోవద్దని కవిటి ఎస్ఐ రవివర్మ కోరారు. కవిటిలోని కల్యాణి పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తెలియజేయాలన్నారు.

శ్రీనివాస్‌కు ఇండియన్ ఐకాన్ అవార్డు



చౌదరి శ్రీనివాస్

గార, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జొన్నలపాడు గ్రామానికి చెందిన బృందావనం నిర్వాహకులు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ గాయకుడు చౌదరి శ్రీనివాస్ ఇండియన్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు సాహితీ వేదిక, జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆయన స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వా హకుల నుంచి తనకు లేఖ అందింది, వచ్చే నెల 2వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న అవార్డును అందుకోనున్నట్టు తెలిపారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

అరసవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి అన్ని విధాలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో మత్స్యకార సంఘ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో 193 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, 11 సముద్ర తీర మండలాలు, 104 గ్రామాలు, 1,12,000 మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. వారి ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

విశాఖలో మరో హనీ ట్రాప్ కేసు

● బాధితుడు శ్రీకాకుళం జిల్లా వాసి

భీమునిపట్నం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో మరో హనీ ట్రాప్ కేసు వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో బాధితుడు శ్రీకాకుళం జిల్లావాసి. దీనిపై 22న భీమిలి పోలీసులకు ఫిర్యాదు అందగా, శుక్రవారం బయటకు వచ్చింది. ఈ కేసులో ఓ వివాహితతో పాటు, సహకరించిన నలుగురిని శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు...

నగరంలోని కంచరపాలేనికి చెందిన వివాహిత (34), విజయనగరం కొత్త అగ్రహారానికి చెందిన జోలా లక్ష్మణ్, ఇంటి సురేష్, బంగారు చక్రధర్, నగరంలోని ఉషోదయ జంక్షన్‌కు చెందిన ములపర్తి వెంకటేష్, పెదవాల్తేరుకు చెందిన మరో ఇద్దరు ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా ఆమె ద్వారా పలువురికి ఫోన్లు చేయించి ముగ్గులోకి దింపేవారు. ఈ విధంగా ఈనెల 18న శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన వెల్డర్ ఒకరికి ఫోన్ చేసి, మాయమాటలతో పడగొట్టారు. తాను 19న విశాఖ వస్తానని, కలుద్దామని ఆయన చెప్పారు. దీంతో ఆరోజు ఫోన్ చేశారు. అయితే తాను తన కుమార్తెను బోయిపాలెం వద్ద హాస్టల్‌లో డ్రాప్ చేసి వెళ్లిపోతున్నానని చెప్పడంతో, కలుద్దామనుకున్నాం కదా అలా ఎలా వెళ్లిపోతారని వివాహిత ప్రశ్నించింది. దీంతో ఆయన తగరపువలస సమీపంలోని సంగివలస మూడుగుళ్ల అమ్మవారి ఆలయం వద్ద ఆటో దిగిపోతానని, అక్కడ కలుద్దామని చెప్పడంతో సరేనంది. ఆయన అక్కడ దిగి నిరీక్షిస్తుండగా మూడు బైకులపై ఆరుగురు వ్యక్తులు వెళ్లి..తమ బంధువైన మహిళకి ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నావంటూ బైక్‌పై బలవంతంగా ఎక్కించుకని విజయనగరం వైపు తీసుకువెళ్లారు. రఘు కాలేజీ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో బైకులు ఆపి ఆయన్ను చితగ్గొట్టారు. జేబులో ఉన్న రూ.50 వేలు, ఏటీఎం కార్డులు తీసుకున్నారు. అతడి సెల్‌ఫోన్ నుంచి రూ.8,900 తమకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే చంపేస్తామని బెదిరించి, అతడిని అక్కడే వదిలేసి సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. అప్పటికి సాయంత్రం 4.45 గంటలు అయ్యింది. ఆయన పర్సు జేబులో మిగిలిన రూ.500తో ఇంటికి వెళ్లిపోయాడు. ముఖం కమిలిపోయి, వంటినిండా దెబ్బలు ఉండడంతో కుటుంబసభ్యులు ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని వివరించాడు. ఈనెల 22న భీమిలి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విశాఖ నార్త్ క్రైమ్ సీఐఎస్ఎన్ ప్రకాశ్ పర్యవేక్షణలో భీమిలి ఎస్ఐ సూర్యప్రకాశరావు, ఆరు బృందాలు నిందితుల సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్, సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించారు. చాకచక్యంగా నిందితులను పట్టుకుని వారి నుంచి మూడు బైకులు, కొంత నగదు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి వివరాలు ఉన్నతాధికారులు నగరంలో మీడియాకు తెలియజేస్తారని, కేసు దర్యాప్తులో ఉందని భీమిలి ఎస్ఐ సూర్యప్రకాశరావు తెలిపారు. కాగా నగరంలో రెండు నెలల క్రితం ఓ హనీ ట్రాప్ కేసు వెలుగుచూసిన విషయం తెలిసిందే.

నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా మారుస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గాన్ని పరిశ్రమల హబ్‌గా మారుస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద ప్రభుత్వ రంగ సంస్థ జెన్‌కో ఆధ్వర్యంలో సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి జెన్‌కో బృందం పరిశీలించిందన్నారు. పవర్ ప్రాజెక్టుకు ఈఆర్‌సీ అనుమతి కూడా ఉందన్నారు. రూ.30 వేల కోట్లతో పవర్ ప్లాంట్ నిర్మాణానికి జెన్‌కో ముందుకు వచ్చిందన్నారు. ఈ పరిశ్రమ రాకతో నియోజకవర్గ ముఖచిత్రం మారిపోతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూమి 800 ఎకరాలు ఉందని, మరో 600 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణంతో సుమారు 15 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. 3,200 మెగావాట్ల పవర్‌ప్లాంట్ నుంచి వచ్చిన యాష్ వల్ల నాలుగు సిమెంట్ ఫ్యాక్టరీలు నెలకొల్పవచ్చునన్నారు. అలాగే ఈసర్లపేట వద్ద 400 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి 60 ఎకరాల భూమిని కేటాయించామన్నారు. నాగావళి నదిపై ముద్దాడపేట వద్ద, వంశధార నదిపై పురుషోత్తపురం వద్ద బ్రిడ్జిలు నిర్మించి రహదారుల కనెక్టివిటీ పెంచుతామన్నారు.

రథసప్తమి ఉత్సవాల్లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రథసప్తమి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక విశాఖ-ఏ కాలనీలో గల తన కార్యాలయంలో పట్టణ వర్తకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. వర్తకులంతా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నగరంలోని పలువురు వర్తకులు, వ్యాపార, వాణిజ్య ప్రముఖులు పాల్గొన్నారు.

117 జీవోకు సవరణలు చేయాలి



ఎంఈవోకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

రణస్థలం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా ఉన్న జీవో 117ను సవరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీవో ప్రకారం మూడు, నాలుగు, ఐదు తరగతులను సమీప పాఠశాలల్లో విలీనం చేయాల్సి ఉంటుందని, ఈ నిర్ణయం సరికాదన్నారు. ప్రైమరీ, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని ఆ సంఘం కార్యదర్శి జి. రమణ డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వితన ప్రతం ఎంఈవో త్రినాథరావుకు అందజేశారు. కె.శ్రీనివాసరావు, ఎ.జగన్, వేణు, జి.శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

శ్రీకాకుళం అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి, పారిశుధ్య పనులను శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీ ప్రసాదరావు పరిశీ లించారు. ఈ మేరకు నగరంలో ఆయన సగుడిగాలి పర్యటన చేపట్టారు. పెద్దపాడు రోడ్డు లో జరుగుతున్న రోడ్డు పనులను, కళింగ రోడ్డులో పారిశుధ్య పనులు, ఏడురోడ్ల కూడలిలో అన్న క్యాంటీన్ నిర్వహణ, ఆర్ట్స్ కళాశాలలో గణతంత్ర్య దినోత్సవ వేడకల పనులు, అలాగే రథసప్తమి ఏర్పాట్లలో భాగంగా పనులను కమిషనర్ పరిశీలించారు.

డ్రైవర్ల వల్లే ఆర్టీసీలో సురక్షిత ప్రయాణం



డ్రైవర్లను అభినందిస్తున్న డీపీటీవో విజయకుమార్

అరసవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అత్యంత సురక్షితమని, అందుకు నిపుణులైన డ్రైవర్లే కారణమని జిల్లా ప్రజా రవాణాధికారి విజయ కుమార్ అన్నారు. 'డ్రైవర్స్ డే' సందర్భంగా శుక్రవారం ఆయన డ్రైవర్లకు గులాబీలు, చాక్లెట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రతీ డ్రైవర్ ఎంతో ఏకాగ్రతతో వాహనాలను నడుపుతారని, నిరంతరం అప్రమత్తతతో విధులు నిర్వహించడం వల్లే ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమనే నమ్మకం ప్రజల్లో ఏర్పడిందని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, గంగరాజు, ఎల్ఎస్ నాయుడు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దక్షిణామూర్తి, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, యూనియన్ ప్రతినిధులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ సేవలు వినియోగించుకోండి

కంచిలి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైల్వే రిజర్వేషన్ సేవలు నేటి నుంచి రెండు పూటలు అందుబాటులో ఉంటాయిని జడ్ఆర్‌యూసీసీ మెంబరు శ్రీనివాస్ రౌళో తెలిపారు. ఈ మేరకు కంచిలి రైలు నిలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇంతవరకు ఒకే పూట రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉండడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రెండో పూట అందుబాటులో ఉంచేలా కృషి చేసినట్టు తెలిపారు. రౌళోను స్థానిక రైల్వే కమిటీ సభ్యులు సూర్యనారాయణ, రవికుమార్, సాహుకారి తిరుపతిరావు అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం



పనులు ప్రారంభిస్తున్న విప్ అశోక్

ఇచ్ఛాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. బూర్జపాడు పంచాయతీ పరిధిలోని డొంకూరులో సీసీ రోడ్డు పనులకు జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజుతో కలసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ ఎంపీపీ డిల్లీరావు, బీజేపీ ఇన్‌చార్జి నిర్మలారెడ్డి, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో ఆలస్యం చేయొద్దు

● మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు



రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్ బంగార్రాజు

అరసవల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల సరఫరాలో ఎటువంటి జాప్యం చేయొద్దని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డైరెక్టర్ రామకృష్ణనాయుడు అన్నారు. నగరంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని శుక్రవారం వారు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల సరఫరా, స్టాక్ వివరాలను డీఎంను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మార్క్‌ఫెడ్‌కు సొంత భవనం లేదని, భవన నిర్మాణానికి అవసరమైన స్థలం, నూతన భవన నిర్మాణానికి అయ్యే ఖర్చు గురించి అధికారులతో చర్చించి వీలైనంత త్వరలో సొంత భవన నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామకృష్ణనాయుడు, మార్క్‌ఫెడ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

ఇచ్ఛాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న ఆహారం సక్రమంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

సోంపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతీ బంగారం షాపులోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ లవరాజు కోరారు. బంగారం షాపుల యజమానులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయని వీటిని అరికట్టే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందులో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

శ్రీకాకుళం రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి (డీపీవో) ఐవీ రమణ తెలిపారు. ఈ మేరకు మండలంలోని సింగుపురం గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం డీపీవో రమణ సందర్శించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. అనంతరం సంపద తయారీ కేంద్రంలో జామ, మామిడి, సపోటా, వాటర్ యాపిల్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లెన రమేష్, జూనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ, డీపీఆర్‌సీ సత్యనారాయణ, హరిత తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త ఫిర్యాదుపై విచారణ

జి.సిగడాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఉప్పాల జయలక్ష్మి తమ జిరాయితీ భూమిని కొంతమంది ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టారని గతంలో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ ఎం.శ్రీకాంత్‌తో పాటు మండల రెవెన్యూ అధికారులు ఆక్రమణ స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఇరువర్గాల సమక్షంలో భూ సర్వే చేసి ఆక్రమణలను గుర్తించి రాళ్లను పాతి హద్దులు నిర్ణయించారు. ఎస్ఐ వై.మధుసూదనరావు, ఆర్ఐ ఆబోతుల రాధ, మండల సర్వేయర్ శాంతారాం, ఐకేపీ సర్వేయర్ మొయ్యి ఈశ్వరరావు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు వినియోగించుకోండి

జి.సిగడాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణన సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి సీహెచ్ సత్యప్రకాష్ అన్నారు. గెడ్డకంచరాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పశువైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. గాలికుంటు, జబ్బవాపు, కాళ్ల సంచా, నోటి సంచా తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచిరెడ్డి లలితకుమారి, మండల పశువైద్యాధికారి ఉప్పాడ సుమన్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



మాట్లాడుతున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి

ఎచ్చెర్ల, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఓటు వినియోగంతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, కొవ్వాడ అణు పార్క్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ.. ఓటు నమోదు ప్రక్రియలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ బి.గోపాల్, డీటీ హేమసుందర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ డి.వనజ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఓటు విలువపై విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు.

28 వరకు గడువు పొడిగింపు

శ్రీకాకుళం రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 12 నెలల పాటు నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి.. వారికి ఉద్యోగవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు పదో తరగతి నుంచి ఆ పై చదువుకున్న యువత పీఎం ఇంటర్న్‌షిప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 10 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించగా.. దీనిని 28వ తేదీ వరకు గడువు పెంచింది.

28 నుంచి ఉచిత ఉపకరణాలకు దివ్యాంగుల గుర్తింపు శిబిరాలు

అరసవల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందించేందుకు గుర్తింపు శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28న శ్రీకాకుళం నగరంలో గల జడ్పీ కార్యాలయంలో, 29న టెక్కలి ఎంపీడీవో కార్యాలయంలో, 30న పలాస ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు నిర్వహించనున్నారు. సదరం ధ్రువపత్రం (40శాతం అంతకంటే ఎక్కువ), రేషన్ కార్డు లేదా ఓటరు కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు (అంగవైకల్యం కనిపించే విధంగా), యూఐడీ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. యూఐడీ కార్డు లేకుంటే సంబంధిత గ్రామ సచివాలయం/ మీసేవా కేంద్రాల్లో గానీ యూఐడీ కార్డు కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుని, రశీదును తీసుకుని రావాలని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.

తాగునీటి బావి క్లోరినేషన్

బూర్జ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పెద్దపేట పంచాయతీ మదనాపురం గ్రామంలో మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి గురువారం తాగునీటి బావిలో పడి మరణించిన విషయం తెలిసిందే. దీంతో శుక్రవారం మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు బావిలోని నీటితో పాటు మట్టిని తొలగించి క్లోరినేషన్ చేయించారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

● నలుగురికి స్వల్పగాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

ఎల్.ఎన్.పేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): శ్యామలాపురంజంక్షన్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం నుంచి కారులో నలుగురు వ్యక్తులు ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి వస్తుండగా శ్యామలాపురం జంక్షన్ దాటిన వెంటనే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఎం.రామచంద్రరాజు, రవికుమార్, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులకు సపర్యలు చేశారు. చెట్టును బలంగా ఢీకొనడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు సపర్యలుచేశారు. బాధితుల ఫిర్యాదు చేస్తామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ బి.హైమావతి తెలిపారు.

ఒడిశా ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వంశధార నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒడిశాకు చెందిన ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. ఈనెల 21న 'ఆంధ్రజ్యోతి'లో 'ఎంత కావాలో చెప్పండి' శీర్షికతో వచ్చిన కథనానికి రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించారు. ఇసుకను తరలిస్తున్న ఒడిశా రిజిస్ట్రేషన్ ఉన్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకు న్నారు. డ్రైవర్ ఒడిశా రాష్ట్రం ఉప్పలాడకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే వెంటనే కొందరు కూటమి నేతల నుంచి అధికారులకు ఒత్తిడి తీసుకు వచ్చినట్లు తెలిసింది. తహసీల్దార్ బి.పాపారావు మాట్లాడుతూ.. ఒడిశా ట్రాక్టర్ యజమాని నుంచి రూ.2 వేలు అపరాధ రుసుం వసూలు చేసి విడిచి పెట్టినట్లు తెలిపారు. మరోసారి దొరికితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మినీ వ్యాన్ బోల్తా



నరసన్నపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కోమర్తి గ్రామం వద్ద జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై టైర్ పంక్చరై మినీ వ్యాన్ శుక్రవారం బోల్తా పడింది. శ్రీకాకుళం నుంచి పలాస చెప్పుల లోడ్‌తో వెళుతున్న మినీ వ్యాన్ ముందుభాగంలో టైరు పేలి అదుపుతప్పింది. అయితే ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వెనుక నుంచి వచ్చే వాహనాలను నిలిపివేసి వ్యాన్‌లో చిక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

భర్తకు భార్య అంత్యక్రియలు


భర్త చితి వద్ద అంత్యక్రియలు చేస్తున్న భార్య తులసమ్మ

నందిగాం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భర్తకు భార్య అంత్యక్రియలు చేసిన ఘటన శుక్రవారం హరిదాసుపురంలో సంభవించింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన లఖినాన గణపతి గురువారం రైలు ట్రాక్ దాటుతుం డగా ప్రమాదానికి గురై మృతి చెందాడు. మానసిక స్థితి బాగు లేనందున ఈయన ప్రమాదానికి గుర య్యాడు. మృతదేహం గుర్తుతెలియనదిగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం గణపతిగా గుర్తించి హరిదాసుపురంలో అంత్యక్రియలకు సిద్ధం చేశారు. అయితే కుమారుడు సాయి కుమార్ విదేశాల్లో ఉండడంతో భార్య తులసమ్మ స్థానిక పెద్ద పైల నేతాజీ తదితరుల సూచనల మేరకు భర్తకు తలకొరివి పెట్టి దహన సంస్కారాలు చేసింది.

అట్రాసిటీ కేసు నమోదు

కొత్తూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మదనాపురంలో కులంపేరుతో దూషించారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీర్అలీ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని సుందరి, బుజ్జయ్యలకు చెందిన వంశపారంపర్యంగా ఉన్న ఎకరా డీ పట్టా భూమిని సాగు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన మాధవరావు ప్రోద్బలంతో జె.కృష్ణమూర్తి ఆక్రమించుకునేందుకు యత్నించారు. దీనిపై బాధితులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు గత ఏడాది డిసెంబరులో ఫిర్యాదు చేశారు. అనంతరం డిసెంబరు 28న సుందరి, బుజ్జయ్య, లిమ్మా దేవిలను మాధవరావు ఇంటికి పిలిపించి కులంపేరుతో దూషించారని లిమ్మాదేవి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

16.2 కిలోల గంజాయి స్వాధీనం


నిందితులతో సీఐ చిన్నంనాయిడు

ఇచ్ఛాపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్న 16.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయిడు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కాంచన గ్రామానికి చెందిన సురేష్ చంద్రగౌడ, రాకేష్ పొకిలీలు గుజరాత్ రాష్ట్రం డైమాండ్ నగర్‌కు ఒడిశా నుంచి 16.2 కిలోల గంజాయితో వస్తూ.. కవిటి మండలం కొజ్జీరియా జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. ఈ క్రమంలో కవిటి ఎస్ఐ రవివర్మ, తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా వారు పట్టుబడ్డారు. వీరినుంచి గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

టెక్కలి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వయోవృద్ధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యులు, విద్యార్థులు, న్యాయ సంబంధిత విద్యార్థులు, రాజకీయేతర సభ్యులు, సేవా దృక్పథం కలిగిన వారు, ఎస్‌హెచ్ జీలు అర్హులన్నారు. పదో తరగతి కనీస విద్యార్హత అని, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల పరిధిలో నివాసిస్తూ ఉండాలని, ఆసక్తి ఉన్నవారు రెండు పాస్‌పోర్టు సైజు కలర్‌ఫోటోలు, ఆధార్ కార్డు, విద్యా సంబంధిత ధ్రువపత్రంతో దరఖాస్తులను ఈనెల 31లోగా కోర్టు సముదాయంలో అందజేయాలన్నారు. పారాలీగల్ వలంటీర్లుగా నియమితులైన వారికి ఎటువంటి జీత భత్యాలు, పారితోషికాలు, వేతనాలు చెల్లించడం జరగదని ఆయన స్పష్టంచేశారు.

పూండిలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

● బంగారం దుకాణాలే లక్ష్యం
● 9 తులాల బంగారం, 9.8 కేజీల వెండి చోరీ చేసినట్లు గుర్తింపు
● మరో దుకాణంలోనూ విఫలయత్నం


తాళాలను కత్తిరిస్తుండగా సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యం


షాపు వద్ద పోలీసుల పరిశీలన

వజ్రపుకొత్తూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య కేంద్రంగా గుర్తింపు పొందిన పూండిలో దొంగలు హల్‌చల్ చేశారు. గురువారం అర్ధరాత్రి బంగారం దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో ఏడుగురు పాల్గొన్నట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దున్న రవికి చెందిన బంగారు దుకాణం తలుపులు పగుల గొట్టి బంగారం, వెండి వస్తువులు అపహరించారు. అలాగే ఆర్‌కే జూయలర్స్ తలుపులు పగలగొట్టేందుకు ప్రయత్నించారు. అయితే తలుపులు ఊడకపోవడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. గురవారం అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు 2 గంటల సమయంలో ఏడుగురు దొంగలు పెద్ద కట్టర్లు, ఇనపరాడ్లతో దున్న రవికి చెందిన బంగారు షాపు పగులగొట్టినట్లు సీసీ ఫుటేజీలో నమోదైంది. 9.8 కేజీల వెండి, 9 తులాల బంగారం చోరీ చేశారని ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. దొంగిలించిన సొత్తును సమీపంలోని చెరువుగట్టుపై ఆగి ఆభరణాలను మూటగట్టి వాటి కవర్లు, బాక్సులను అక్కడ వదిలి వెళ్లినట్లు గుర్తించారు. యథావిధిగా శుక్రవారం ఉదయం దుకాణం తెరిచేందుకు రవి వెళ్లగా తలుపులు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాశీబుగ్గ సీఐ తిరుపతిరావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్ సిబ్బందితో కలిసి ఘటనా ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. అలాగే క్లూస్ టీం వచ్చి క్షుణ్ణంగా పరిశీలించి నమూనాలు సేకరించారు. దుకాణం పైభాగంలోనే యజ మాని రవి నివసిస్తున్నాడు. దీంతో వస్తువులన్నీ దుకాణంలోనే ఉంటాయని ఆయన తెలిపారు. అయితే క్లూస్‌టీం తనిఖీలో కొంత బంగారం, వెండి షాపులోనే ఉన్నట్లు గుర్తించి వాటిని యాజమానికి అప్పగించారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హడలిపోతున్న పూండివాసులు

ఇదిలా ఉండగా గతంలో ఎన్నడూ లేని విధంగా దొంగలు హల్‌చల్ చేయడంతో స్థానికులు హడలిపోతున్నారు. దొంగలు ఎప్పటినుంచే రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడి ఉంటారని వారు భావిస్తున్నారు. దుండగులు ద్విచక్రవాహనంపై వచ్చి దొంగతనానికి పాల్పడ్డారని తెలుస్తోంది. గతంలో పూండి శివాలయంలో వెండివస్తువులు చోరీకి పాల్పడగా ఎస్ఐ నిహార్ ఆధ్వర్యంలోనే దొంగలను పట్టుకొని వస్తువులను రికవరీ చేశారు.

మంచు దుప్పటి


జలుమూరులో దట్టంగా పడుతున్న పొగమంచు

జలుమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా పొగమంచు ఎడ తెరిపి లేకుండా కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఉదయం 9 గంటల వరకు మంచు కురవడంతో రైతులు వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోంది. మంచుతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ పొగ మంచు వల్ల పూత దశలో ఉన్న మినప, పెసర, అపరాలకు తీవ్ర నష్టం సంభవిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే మామిడి పూత దెబ్బతిని రాలిపోతుందని మామిడి రైతులు పేర్కొంటున్నారు.

'ఐతమ్' ఐఐసీకి ఫోర్ స్టార్ ర్యాంక్

టెక్కలి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ 2023-24 విద్యా సంవత్సరంలో ప్రకటించిన ఐఐసీ ర్యాంకుల్లో స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు ఫోర్ స్టార్ ర్యాంక్ వచ్చిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. 2018 నుంచి ఐతమ్ పేరుతో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ సెల్ ఉద్యోగ, ఉపాధి, ఉత్పాదక రంగాల్లో విద్యార్థుల పురోభివృద్ధి సాధించేందుకు చేస్తున్న కృషిని అభినందిస్తూ ఆల్‌ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యు కేషన్ (ఏఐసీటీఈ) చైర్మన్ టీజీ సీతారాం, ఎంవోఈ చీఫ్ ఎన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ అబేజరే, ఎంవోఈ ఇన్నోవేషన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ దీపన్ సాహు ఈ ర్యాంకింగ్ ధ్రువపత్రాన్ని జారీ చేశారన్నారు. దేశవ్యాప్తంగా 14,725 ఇంజనీరింగ్ కళాశా లల్లో ఐఐసీ విభాగంలో 5,455 సెంటర్లు ఉత్సాహంగా పని చేస్తున్నాయని గుర్తించారని, అందులో ఆదిత్య ఒకటి కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గుర్తింపు లభించేందుకు కృషి చేస్తున్న ఐఐసీ సెంటర్ అధ్యక్షుడు గుడ్ల సతీష్ కుమార్ బృందానికి యాజమాన్య ప్రతినిధులు, డైరెక్టర్ నాగేశ్వ రరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అభినందించారు.

స్టేట్‌బ్యాంక్‌లో షార్ట్ సర్క్యూట్

టెక్కలి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండ్‌లోని స్టేట్‌బ్యాంక్‌లో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా ఖాతాదారులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. బ్యాంకులోని ఓ స్విచ్‌బోర్డు నుంచి పొగలు వచ్చి దట్టంగా వ్యాపించడంతో వారంతా బయటకు పరుగులుతీశారు. అసలు ఏం జరిగిందో తెలియక గందరగోళానికి గురయ్యారు. చివరకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌గా గుర్తించారు. అయితే ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో సేవలు నిలిచిపోయాయి. షార్ట్ సర్క్యూట్ అయిన బోర్డును యుద్ధ ప్రాతిపదికన బాగుచేశారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో సోమవారం నుంచి బ్యాంకు సేవలు యథావిధిగా కొనసాగుతాయని మేనేజర్ రవికుమార్ తెలిపారు.

211 ఇంకుడు గుంతలకు ప్రతిపాదనలు

పోలాకి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని 23 సచివాలయాల పరిధిలో 211 ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు హౌసింగ్ డీఈ కె.అప్పారావు, ఏఈ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. కాలనీ ఇళ్లల్లో 211 ఇంకుడు గుంతలు తీసేందుకు గాను తొలి విడతలో 176కి పాలనామోదం లభించిందన్నారు. 24 ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తయ్యాయని, వాటికి బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. మండలంలోని 2,289 జగనన్న కాలనీ ఇళ్లకు 1,605 ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారన్నారు. 371 పూర్తిగా పునాదులు వేయలేదన్నారు. వాటి స్థానంలో అర్హతలున్న వైసీపీ హయాంలో మంజూరుకాని వారికి ఇళ్ల మంజూరుచేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మండలం నుంచి 1500 దరఖాస్తుల వచ్చాయని, దరఖాస్తుదారు ఇంటికి స్వయంగా పరిశీలించి ఇళ్ల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు.

తరగతికి అనుమతించకపోవడంపై ఫిర్యాదు

జలుమూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు 10 నిమషాలు పాఠశాలకు ఆల స్యంగా వెళితే హెచ్‌ఎం అంగీకరించకపోవడంపై బాలుడి తల్లి మహలక్ష్మి ఎంఈవోకి ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. జలుమూరుకు చెందిన దుడ్డి హిమాన్షు స్థానిక ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం బాలుడిని తండ్రి రాంబాబు పది నిమిషాలు ఆలస్యంగా స్కూలుకి తీసుకెళ్లాడు. దీంతో హెచ్‌ఎం. మెండ రామారావు కుర్రాడికి క్లాసుకు అనుమతించలేదు. దీంతో చేసేదేమీలేక ఇంటికి తీసుకువెళ్లాడు. ఈ నేపథ్యంలో బాలుడి తల్లి మహలక్ష్మి మరలా పాఠశాలకు వెళ్లి ఎందుకు అనుమతించరని హెచ్‌ఎంను ప్రశ్నించింది. దీంతో హెచ్‌ఎం ఆమెపై రుసరుసలాడి తరగతులను అనుమతించారు. ఈ ఘటనపై ఆమె ఎంఈవోకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంఈవో బి.మాధవరావును వివరణ కోరగా ఆలస్యమైందని పిల్లలను స్కూలుకి అనుమతించక పోవడం తప్పిదమని, తల్లిదండ్రులను మోటివేషను చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి తప్పిదం జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులందరికీ పథకాలు: మంత్రి అచ్చెన్న


వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తా మని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయం లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలున్నంత త్వరగా ప్రజలకు మేలు చేసేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధులలో అలసత్వం వహించవద్దన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, మెరుగుదలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నూతన గృహాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, రహ దారులు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులున్నాయని, సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మండలానికి చెందిన నలుగురు క్షేత్ర సహాయకులకు నియామక పత్రాలు అందజేశారు. కార్య క్రమంలో పీపీసీఎస్ మాజీ అధ్యకుడు కింజరాపు హరివర ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మస్తర్లలో దిద్దుబాట్లు

● సామాజిక తనిఖీ ప్రజావేదికలో బట్టబయలు



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

నరసన్నపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల్లో పనికి రాని వేతనదారులు పనికి వచ్చినట్లు వేతనాలు చెల్లించినట్లు సోషల్ ఆడిట్‌లో బయటపడింది. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో ప్రతీ పంచాయతీలో మస్తర్లలో దిద్దుబాట్లు, మస్తర్లలో వేలి ముద్రలు లేకుండా ఉండడాన్ని గుర్తించారు. అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్, సాంకేతిక సహాయకులకు నోటీసులు జారీ చేయాలని డ్వామా పీడీ సుధాకరరావు ఆదేశించారు. రికార్డులు తప్పుల తడకగా ఉండడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికిరాని వారికి వేతనాలు చెల్లించిన నేపథ్యంలో బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా విజిలెన్స్ ఏపీడీ స్వరూపరాణి, ఏపీడీ శైలజ, ఎంపీపీ ఆరంగి మురళి, ఎంపీడీవో మధుసూదనరావు, ఏపీవో యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజులుగా నీరు కలుషితం

● ఇబ్బందులుపడిన విద్యార్థులు


బోరు సమీపంలో నిల్వ ఉన్న మురుగు నీరు

మెళియాపుట్టి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు జూనియర్ కళాశాల విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నాలుగు రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో వారు ఇక్కట్లకు గురవుతున్నారు. పాఠశాల ఆవరణలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండుతున్నారు. అయితే కలుషితమైన నీటితోనే వంటలు చేస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నీటితో వంటలు చేయడంతో గురువారం అన్నం వాసన రావడంతో విద్యార్థులు తినేందుకు ఇష్టపడలేదు. దీంతో శుక్రవారం దూర ప్రాంతం నుంచి నీటిని తీసుకువచ్చి వంటలు చేశారు. బోరు పక్కనే ముస్లిం వీధి నుంచి వస్తున్న వాడికనీరు వల్ల బోరు నీరు కలుషితమవుతోందని హెచ్‌ఎం గణపతిరావు తెలిపారు. అయితే పాఠశాలలో 200 మంది, కళాశాలలో 205 మంది ఉండడం వల్ల నీరు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ, విద్యా శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లమన్నారు.

గ్రానైట్ కార్మికుల చట్టాలు అమలయ్యేలా చూడాలి



నినాదాలు చేస్తున్న సంఘ నాయకులు

టెక్కలి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రత, హక్కులు, చట్టాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని జిల్లా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి ఎన్.షణ్ముఖరావు కోరారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షోభం పేరుతో మధుకాన్, ఎంటర్‌ప్రైజెస్ అండ్ ఎంటర్ ప్రైజెస్ గ్రానైట్ క్వారీల యజమానులు అరకొర జీతాలిచ్చి దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. తక్షణం లేబర్ అధి కారులు జోక్యం చేసుకొని కార్మిక చట్టాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్ర మంలో సంఘ నేతలు కృష్ణారావు, మధుసూధన్, రాజారావు, సూర్యనారాయణ, అప్పారావు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధికి చర్యలు


అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ అవుట్‌లెట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ

నరసన్నపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ నరసన్నపేటలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన అండర్ డ్రైనేజ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేసి మురుగు నీటిని శుద్ధి చేసే దిశలో కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలో అండర్ డ్రైనేజ్ అవుట్ లెట్‌లను పరిశీలించారు. ఏడేళ్ల కిందట నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌ను ఇటీవల కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్ దినకర్ పరిశీలించడంతో పనుల్లో మరలా కదిలిక వచ్చింది. మురుగు నీటిని శుద్ధి చేసి పొలాలకు అందించేందుకు సాధ్యా సాధ్యాలను పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఎస్ఈ తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రంగనాథం, డీఈఈ సుదర్శనరావు, ఏఈలు కనకేశ్వరరావు, బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందాలి

కాశీబుగ్గ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందాలని అంతర్జాతీయ దివ్య జీవన సంఘం ఉపాధ్యక్షుడు పద్మనాభానంద సరస్వతి మహరాజ్ అన్నారు. శుక్రవారం కాశీబుగ్గలో తెలుగు రాష్ట్రాల 49వ దివ్య జీవన మహాసభలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ దిశగా భాగస్వాములు కావాలని కోరారు. ఉదయం ధ్యానం, నగర సంకీర్తన, యోగా సనాలు, గీత పారాయణం, దివ్య జీవన ధ్వజా రోహణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వామీజీలు వివిధ అంశాలపై ప్రసంగించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో గౌరవాధ్య క్షుడు కేవీ రామకృష్ణ, అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్, ప్రతినిధులు సత్యనారాయణ, మురళీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మందస,జనవరి24(ఆంధ్రజ్యోతి): మహిళలు సామాజిక, ఆర్థికాభివృద్ధి సాధించాలని వెలుగు ఐటీడీఏ ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మహిళా సంఘాల శిక్షణ నిర్వహించారు. సమావేశంలో లీగల్ కోఆర్డినేటర్ వీరంనాయుడు, క్లస్టర్ కోఆర్డినేటర్ కిశోర్, స్వామినాయుడు, ముఖలింగం, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను పరిష్కరిస్తాం

పలాస, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తామని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు శక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా 10 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ ఫిర్యాదులను ఆయా స్టేషన్లకు పంపామని, వాటిని పరిష్కరించి తెలియజేస్తామన్నారు.

కొత్తమ్మతల్లి హుండీల ఆదాయం రూ.3.61 లక్షలు

కోటబొమ్మాళి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయ హుండీల ఆదాయం రూ. 3,61,145 వచ్చినట్లు ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఈ మొత్తం 55 రోజుకు సంబంధించి భక్తుల నుంచి వచ్చిన ఆదాయమని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఏసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జీవీబీఎస్ రవికుమార్, యూనియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రిక్షా స్టాండ్ తొలగింపు అన్యాయం

నరసన్నపేట, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రిక్షా స్టాండ్‌ను తొలగించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టడంతో శుక్రవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సంద ర్భంగా సంఘ నాయకుడు బెవర రాము మాట్లాడుతూ.. రోడ్డు పోరంబోకు స్థలంలో ఉన్న రిక్షా స్టాండ్‌ను తొలగించడం అన్యాయమన్నారు. రిక్షా స్టాండ్ ఉన్న ప్రదేశంలో షాపులు నిర్మాణం చేసేందుకు ఆర్టీసీ అధికారులు భారీ వృక్షాన్ని తొలగించడంపై రిక్షా కార్మికులు అడ్డుకున్నారు.

ఫిబ్రవరి 28 లోగా రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

జలుమూరు/నందిగాం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28 లోగా 7 శాతం వడ్డీతో రెన్యువల్ చేసుకోవాలని చల్లవానిపేట, అల్లాడ, తెంబూరు పీఏసీఎస్‌ల సీఈవోలు వాన వేణుగోపాలరావు, పి.గిరిధర్, పీఎస్ఎన్ దాసు వేర్వేరు ప్రకటనల్లో కోరారు. గడువులోగా రుణాలు రెన్యువల్ చేసుకుంటే రాయితీ వర్తిస్తుందన్నారు. గడువు దాటిన రుణాలకు 13 శాతం వడ్డీతో చెల్లించాల్సి వస్తుందన్నారు.

అక్రమ నిర్మాణాల సర్వే

కొత్తూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గూనభద్ర గ్రామంలోని పాత జ్యూట్ మిల్లు స్థలాన్ని ఆనుకొని ఉన్న గ్రామకంఠంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామానికి చెందిన వెంకటరమణ, హరి తహసీల్దార్ రవిచంద్రకు ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలించి నివేదిక అందజేయాలని తహసీల్దార్ ఆదేశాలతో మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య శుక్రవారం కొలతలు వేసి ప్రాథ మికంగా ఆక్రమణలు గుర్తించారు. సర్వే పూర్తి చేసి పూర్తిస్థాయి నివేదికను తహసీల్దార్‌కు అందించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల రాకతో లే అవుట్ యజమానులు కొంత గోడను తొలగించారు.

నిరంతర కృషితో ఉత్తమ ఫలితాలు

పాతపట్నం,జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆసక్తితో నిరంతర కృషి చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు అన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. గురుకులాల జిల్లా సమన్వయాధికా రి ఎన్.బాలాజీ, ప్రిన్సిపాల్ వి.అర్చన, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ, ఐతం కళాశాల డీన్ డా.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

పలాసరూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): లొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష అందజేసిన నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేపట్టారు. ఇటీవల ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పలువురు అందజేసిన పుస్తకాలు, పెన్నులను విద్యార్థులకు అందజేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అన్నెపు శ్రీధరపాత్రో, సర్పంచ్ సీమన్, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.తిరుపతిరావు, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హరిపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. హరిపురంలో ఒక ప్రైవేటు కళా శాలలో 'సంకల్పం' నిర్వహించి అవగాహన కలిగించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు సోమేశ్వరరావు, రవి పాల్గొన్నారు.